# కూటమిలో సహకార ముసలం

- తేలని సొసైటీల త్రిసభ్య కమిటీలు
- మూడుసార్లు వాయిదా పడిన సమావేశాలు
- జనసేన, టీడీపీ, బీజేపీ నేతల సిగపట్లు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో కూటమి నేతలను సమన్వయం పరిచేందుకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు అసలైన సవాళ్లు మొదలయ్యాయి. గత మూడు రోజులుగా ఆయన ఇతర కార్యక్రమాలను సైతం పక్కన పెట్టి గ్రామ స్థాయి సొసైటీ చైర్మన్‌ల ఎంపిక కసరత్తు చేస్తున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల భర్తీలో అంతగా ఇబ్బందులు లేనప్పటికీ ప్రస్తుతం నియోజకవర్గ స్థాయిలో నామినేటెడ్ పదవుల భర్తీలో సతమతం అవుతున్నారు. ఇప్పటికే ధవళేశ్వరం ప్రాజెక్టు కమిటీ కూర్పులో తీవ్ర తర్జన భర్జనలు జరిగాయి. కూటమి నేతలు రాజోలు నియోజకవర్గానికే ఈ పదవి ఇవ్వడం ఆనవాయితీగా రావడంతో ఆ పదవి భర్తీలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. గతంలో క్షత్రియ వర్గానికి దక్కే ఈ పదవి ఈ సారి బీసీలకు అందునా టీడీపీ నాయకుడు గుబ్బల శ్రీనివాస్‌కు దక్కింది. రాజోలు డీసీగా ఉన్న జనసేన నాయకుడు పినిశెట్టి బుజ్జి కూడా పోటీ పడినా టీడీపీనే వరించింది. నియోజకవర్గంలోని ప్రఖ్యాత అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఎంపికలో కూడా ప్రస్తుతం ఉత్కంఠ కొనసాగింది. త్వరలోనే ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో అధికారికంగా ఉన్న ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలితో పాటు ఉత్సవాలకు అనధికారికంగా ఉత్సవ కమిటీని వేయడం ఇక్కడ ఆనవాయితీ వస్తోంది. ఈ పదవి కోసం దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, మంగెన నాని, రావూరి నాగు మధ్య పోటీ నడిచినా చివరకు దిరిశాల బాలాజీ పేరును ఖరారు చేశారు. అనేక సిగపట్ల మధ్య ఈ కూర్పు జరిగిన నేపథ్యంలో ప్రస్తుత గ్రామ స్థాయిలో భర్తీ చేయాలని తలపెట్టిన వ్యవసాయ సహకార సంఘాల త్రిసభ్య కమిటీల భర్తీ రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్‌కు పెనుసవాల్‌గా మారింది. వీటి భర్తీ కోసం గత మూడు పర్యాయాలుగా వేసిన సమావేశాలు వాయిదా పడ్డాయి. నియోజకవర్గంలో రాజోలు, మలికిపురం, తాటిపాక, సఖినేటిపల్లి డీసీసీబీల పరిధిలో సమారు 20 వరకూ వ్యవసాయ సహకార సంఘాలు, ఉండగా వీటి పరిధిలో ఒక డీసీసీబీ డైరెక్టర్, ఒక డీసీఎంఎస్ డైరెక్టర్ పదవులు రాజోలు నియోజకవర్గానికి వస్తాయి. సహకార సంఘాలకు ఎన్నికలు లేకుండా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాదిరిగానే కూటమి సర్కారు కూడా త్రిసభ్య కమిటీలను వేసి చైర్మన్లను ఎంపిక చేయడానికి నిర్ణయించింది. దీంతో వాటి భర్తీకి ఎమ్మెల్యే దేవ తీసుకున్న చర్యలు ఓ కొలిక్కి రావడం లేదు.


మోరి వ్యవసాయ సహకార సంఘ భవనం

## ఎవరి ప్రయత్నాలు వారివి..

గ్రామ స్థాయిలో కూటమి నేతల మధ్య గట్టి పోటీ ఉండడంతో ఈ పరిస్థితి నెలకొంది. శాసనసభ పరిధిలో త్రిముఖ పోటీ లెక్కన చూస్తే మూడు పార్టీ మధ్య రెండు నుంచి మూడు వేల ఓట్ల వ్యత్యాసమే ఉంటుంది. అయినా ఇక్కడ జనసేనదే పైచేయి కావడంతో ఆ పార్టీ నేతలకు కాస్త ఎక్కువ పదవులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన నేతలు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ పదవుల కోసం తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రధానంగా కేశనపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ కోసం జనసేన నుంచి ముగ్గురు, టీడీపీ నుంచి ఒక్కరు పోటీ పడుతున్నారు. టీడీపీ నుంచి ఆకుల సత్యనారాయణ పేరు పరిశీలనలో ఉంది. చింతలమోరి సొసైటీ పరిధిలో జనసేన–బీజేపీ మధ్య గట్టి పోటీ ఉంది. బీజేపీ నేత భారత ఆహార సంస్థ కమిటీ సభ్యుడు దొడ్డా నాగబాబు సొసైటీ చైర్మన్ పదవి కోసం తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. తూర్పుపాలెం సొసైటీ పరిధిలో జనసేన నేతల మధ్యే పోటీ ఉండగా యెనుముల సూర్యనారాయణ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. మలికిపురం సొసైటీ చైర్మన్‌గా జంపన సత్యనారాయణరాజు పేరు దాదాపు ఖరారయింది. గుడిమెళ్లంక సొసైటీ పదవికి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు మల్లిపూడి సత్తిబాబు అనుచరుడు గమిడి చినబాబు పేరు ఖరారయింది. రామరాజులంక సొసైటీ పదవికి జనసేనలోని ఓదూరి నాగ ప్రసాద్, ఉంగరాల బాలాజీ మధ్య పంచాయితీ నడుస్తుంది. గూడపల్లికి పున్నం గంగారాం, లక్కవరానికి గంటా నాయుడు ఖరారయ్యారు. సఖినేటిపల్లి సొసైటీ చైర్మన్ కోసం టీడీపీ నుంచి గునిశెట్టి వెర్రియ్య, పడాల శంకరం, రుద్రరాజు సూరిబాబు రాజు, జనసేన నుంచి గునిశెట్టి రాంజీ, పిన్నమరాజు శ్రీనివాసరాజుల మధ్య గట్టి పోటీ నెలకొంది. గుడిమూల సొసైటీకి టీడీపీ నేతలు రుద్రరాజు మురళీరాజు, డా.రుద్రరాజు పద్మరాజు మధ్య పోటీ నెలకొంది. రామేశ్వరం సొసైటీకి జనసేనకే చెందిన అల్లూరి రంగరాజు, కొణతం సత్యనారాయణ, పాటబల్ల సూరిబాబు మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అంతర్వేది సొసైటీకి టీడీపీకి చెందిన పోతురాజు కృష్ణ, జనసేన నుంచి రావూరి నాగు పోటీ పడుతున్నారు. మోరి సొసైటీకి బల్ల రాము, పప్పుల రమేష్ ప్రయత్నిస్తున్నారు. అప్పనరాముని లంక సొసైటీకి దివ్వి శంకరం, రావూరి పెద్దబ్బుల మధ్య పోటీ నెలకొంది. ఉయ్యూరివారి మెరక, ఉయ్యూరి వారి మెరకకు ఉయ్యూరి హరి ప్రసాదరాజు, కంతేటి వెంకట్రామరాజు, పోటీ పడగా వీరా రామారావు వైపు మొగ్గు చూపిస్తున్నట్లు సమాచారం. రాజోలు సొసైటీ పదవి టీడీపీకి చెందిన కసుకుర్తి త్రినాథస్వామి పేరు దాదాపు ఖరారైంది. చింతలపల్లి సొసైటీ జనసేన నుంచి పిప్పళ్ళ రాంబాబు పేరు ఖరారైంది. తాటిపాకకు గుండాబత్తుల తాతాజీ, పొన్నమండకు అడబాల రాంబాబు, బి.సావరం–పొదలాడకు కాండ్రేగుల కుశలుడు దాదాపు ఖరారయ్యాయి. కడలి, మామిడికుదురు, కాట్రేనిపాడు సొసైటీ చైర్మన్ల ఎంపికలో తర్జన భర్జనలు జరుగుతున్నాయి.

## క్లుప్తంగా

### భవితా సెంటర్ సందర్శన

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరకలో మంగళవారం భవితా సెంటర్‌ను సమగ్ర శిక్ష(ఐఈ)కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ సందర్శించారు. ఈ మేరకు సెంటర్ తనిఖీలో భాగంగా ఆయన పిల్లల అభివృద్ధి, రికార్డు అప్‌డేట్ చేయడం, భౌతిక వసతులు మెరుగుపరచడం వంటి వాటిపై పరిశీలన చేశారు. విధులు నిర్వహణపై ఐఈఆర్‌పీ టీచర్లు జె.మిస్సమ్మ, పి.ధరణిలను ఆయన అభినందించారు. అలాగే స్థానిక ప్రైమరీ స్కూల్‌లో మిడ్డే మీల్స్ అమలు తీరును హెచ్‌ఎం శ్రీనివాసరావుతో కలసి కో ఆర్డినేటర్ సత్యనారాయణ పరిశీలించారు. పాఠశాల టీచర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

### బాధితురాలికి సాయం

సఖినేటిపల్లి: మండలంలోని గొందిలో మంగళవారం కరెంటు షాక్ బాధితురాలు దుర్గా భవానికి, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల టౌన్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు ఇంటి వద్ద భవానీకి ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు చేతుల మీదుగా పై మొత్తాన్ని అందజేశారు.

### భవన నిర్మాణ సంఘం నూతన కార్యవర్గం


బోణం చిన్న

మలికిపురం: ఏఐటీయూసీకి అనుబంధం సంస్థ భవన నిర్మాణం కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బోణం చిన్న (బట్టేలంక), కొప్పిశెట్టి నాగార్జున రావు (విశ్వేశ్వరాయపురం) ఎన్నికయ్యారు. మంగళవారం మలికిపురంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నారు. అలాగే గౌరవాధ్యక్షుడిగా జక్కంపూడి కుమారస్వామి, ముఖ్య సలహాదారుగా కుంపట్ల సాయిబాబు, ఉపాధ్యక్షులుగా చొల్లంగి సూరిబాబు, అడబాల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా అమలదాసు నాగరాజుతో సహా 27 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికవటంపై ఏఐటీయూసీ నాయకులు కె. సత్తిబాబు, దేవ రాజేంద్రప్రసాద్ హర్షం వ్యక్తం చేసి, నూతన నాయకత్వానికి అభినందనలు తెలియచేశారు.

### అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం


గోగన్నమఠంలో హోసన్నకు సాయం చేస్తున్న జెడ్పీటీసీ అన్నపూర్ణ

సఖినేటిపల్లి: రాజోలు మండలం గోగన్నమఠానికి చెందిన వర్దనపు హోసన్నకు, రామేశ్వరానికి చెందిన ఎన్నారై, వైఎస్సార్ సీపీ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. హోసన్న మోకాలికి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ మేరకు వైద్యం ఖర్చులు నిమిత్తం శశికిరణ్ పంపిన పై మొత్తాన్ని ఆయన తల్లి, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ చేతుల మీదుగా హోసన్నకు అందజేశారు. వెంట మాజీ ఉపసర్పంచ్ సరెళ్ల జీవన్, దొండపాటి పూర్ణప్రకాష్ పాల్గొన్నారు. హోసన్న కుటుంబ సభ్యులకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

### రాఘవమ్మ మృతి


రాఘవమ్మ (ఫైల్)

అయినవిల్లి: కూలీల హక్కుల కోసం పోరాడిన నాయకురాలు, కుడిపూడి రాఘవమ్మ మంగళవారం మధ్యాహ్నం ఆమె స్వగృహం వద్ద మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. కుడిపూడి రాఘవమ్మ మృతికి సీపీఎం పార్టీ జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. ఆమె భర్త మాస్టారు. సీపీఎంలో పార్టీ సభ్యురాలిగానూ కొనసాగారు.

### టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: పుట్టిన నాటి నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు టీకాలు వేయించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని కమ్యూనిటీ హెల్త్ అధికారి బి.అప్పారావు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీలో ఆశ డే సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ చిన్నారులకు టీకాలు వేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించాలన్నారు. అలాగే టీకాలు వేసే సమయాన్ని, ప్రాంతాలను తెలియజేయాలన్నారు.

### ఎల్.గన్నవరంలో ఆగని ఇసుక దందా

పి.గన్నవరం: మండలంలోని ఎల్.గన్నవరం గ్రామంలో వశిష్టా నదీపాయలో పెద్ద ఎత్తున ఇసుక దందా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తవ్వి దోచుకుంటున్నారు. రెండు సార్లు గ్రామానికి చెందిన కూటమి నేతలు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని ఆందోళన చేపట్టినా.. అక్రమ ఇసుక తవ్వకాలు ఆగడం లేదు. నియోజకవర్గ నేతల అండ ఉండటంతో అధికారులు ఈ ర్యాంపు వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ర్యాంపును నిలిపివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ప్లాస్టిక్ రహిత దేవాలయంగా అయినవిల్లి


సమీక్షలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అయినవిల్లి: ప్లాస్టిక్ రహిత దేవాలయంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయాన్ని తీర్చిదిద్దాలని, అలాగే భక్తులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు తమ వంతు ప్లాస్టిక్‌ను ఉపయోగించకుండా సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సూచించారు. మంగళవారం స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో ఆమె వివిధ శాఖాధికారులతో ఆలయ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. పలు అభివృద్ధి అంశాలపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ అయినవిల్లి సిద్ధి వినాయక స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆమె ఆదేశించారు. ఆలయ ఆవరణలో ఎలాంటి ప్లాస్టిక్ వస్తువులను, కవర్లను అనుమతించరాదని జేసీ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ నిబంధన ఈనెల 14వ సంక్రాంతి నుంచే అమలు చేయాలని అధికారులకు సూచించారు. భక్తుల సౌకర్యార్థం విఘ్నేశ్వరుని ఆలయ ప్రాంగణంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నామని, అదీ జిల్లాలో మొదట ఈ ఆలయం నుంచే మొదలుపెడుతున్నట్టు ఆమె ప్రకటించారు. జిల్లాలో తొలిసారిగా ఈ విఘ్నేశ్వర స్వామి ఆలయం నుంచే ఈ కార్యక్రమం మొదలు పెడుతున్నామన్నారు. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం సంక్రాంతి నుంచే అమల్లోకి రానుందన్నారు. ఆలయంలో ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా వేరే బుట్టలు, వస్తువులను వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

# సంప్రదాయబద్ధంగా సంక్రాంతి చేసుకోవాలి


ఎస్సై సురేంద్ర

కొత్తపేట: జిల్లా ప్రజలంతా సంక్రాంతి పండగను ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా సంస్కృతి, సంప్రదాయబద్ధంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో చేసుకోవాలని పోలీసు శాఖ హెచ్చరికలు జారీ చేసింది. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసు అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. దానిలో భాగంగా కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర మంగళవారం సాయంత్రం పోలీసు హెచ్చరికలను మీడియాకు విడుదల చేశారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, పేకాట, గుండాటలు నిర్వహించుట, పాల్గొనుట చట్టరీత్యా నేరమని, దీన్ని ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పందాలు నిర్వహించే వారిపైన, కోడి కత్తులు కట్టేవారి పైనా, గుండాట నిర్వాహకుల పైన, బైండోవర్ చేయబడిన వారు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడిపందాలు, జూదం, ఇతర అసాంఘిక కార్యక్రమాల స్థానంలో ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలపోటీలు నిర్వహించుకోవాలని సూచించారు. మీ ప్రాంతంలో లేదా గ్రామంలో కోడిపందాలు, గుండాట గురించి సమాచారాన్ని సంబంధిత పోలీసు స్టేషన్ ఎస్ఐ/సీఐ/డీఎస్పీ లేదా 112 లేదా ఎస్‌బీ కంట్రోల్ రూమ్ అమలాపురం సెల్ 8143792101 నంబర్‌కు సమాచారాన్ని అందించి, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, దీని వలన ప్రజలకు మెరుగైన సేవలను అందించగలుగుతామని తెలిపారు.

# విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రావులపాలెం: రాష్ట్ర స్థాయి స్మార్ట్ ఆంధ్ర హ్యాకథాన్ వివిధ స్కిల్ డెవలప్మెంట్ పోటీల్లో సీనియర్ విభాగంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ద్వితీయస్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఇటీవల తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్యా శాఖ, జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ హైదరాబాద్ వారి సౌజన్యంతో నిర్వహించిన పోటీల్లో తమ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బీకాం చదువుతున్న విద్యార్థులు ఎస్ఎస్ఎం రెడ్డి, యూడీ భవాని, జి.సంధ్యారాణి, బీవీఎస్ఎల్ భార్గవి బృందం పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. వీరికి రూ.5 వేల నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం ఇచ్చారన్నారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను కామర్స్ అధ్యాపకులు బిపిన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ బాబు, అధ్యాపకులు అభినందించారు.

# విద్యార్థినులకు సంక్రాంతి మెహందీ పోటీలు


కొత్తపేటలో మెహందీ పోటీల్లో విద్యార్థినులు

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థినులకు మెహందీ పోటీలు నిర్వహించారు. కళాశాల సంక్రాంతి సంబరాల్లో భాగంగా కళాశాల కల్చరల్ కమిటీ, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినుల సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ మెహందీ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి మాట్లాడుతూ మెహందీ పోటీలు నిర్వహించడం ద్వారా పిల్లల్లో స్కిల్ ఇంప్రూవ్‌మెంట్ జరుగుతుందని, నేడు మెహందీ డిజైనింగ్ బ్యూటీ కోర్సుల ద్వారా అనేకమంది జీవనోపాధిగా చేసుకున్నారన్నారు. అలంకరణ ప్రియత్వం ఉన్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికార విభాగం కన్వీనర్ సీహెచ్ నాగరాణి, అధ్యాపకులు దీపికాదేవి, నాగదీపిక, నాగజ్యోతి, ప్రసన్నజ్యోతి ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తవ్వకాలను నిలిపివేయాలి


అక్రమ ఇసుక తవ్వకాలపై జేసీ నిషాంతికి వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకుడు సూపర్

పి.గన్నవరం: వైనతేయ నదీపాయలో స్థానిక డీఎస్ పాలెం వద్ద అక్రమంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ టీడీపీ జిల్లా కార్యదర్శి పడాల వెంకటేశ్వరరావు (సూపర్) మంగళవారం అమలాపురంలో జేసీ టి.నిశాంతికి వినతి పత్రం అందజేశారు. కూటమి నేతల ఆధ్వర్యంలో డీఎస్ పాలెంలో అనధికారికంగా ఇసుక ర్యాంపు నిర్వహిస్తున్న విషయం విదితమే. దీనిపై గత నెల 30న కొత్తపేట ఆర్డీఓకు సూపర్ ఫిర్యాదు చేయడంతో ఆరోజు ఆగిపోయిన ర్యాంపును మళ్లీ మంగళవారం ప్రారంభించారు. దీంతో సూపర్ మళ్లీ జేసీకి ఫిర్యాదు చేశారు. అక్రమంగా ఇసుకను తరలించుకుపోతున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని సూపర్ జేసీకి వివరించారు. అక్విడెక్టుకు సమీపంలో ఇసుక తీయడం వల్ల దాని మనుగడకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని జేసీకి సూపర్ తెలిపారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని జేసీ చెప్పారని సూపర్ విలేకరులకు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం డీఎస్ పాలెం ఇసుక ర్యాంపును అధికారులు మూయించి వేశారు.


జి.అగ్రహారంలో శివకేశవులను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

### శివకేశవుల పల్లకీ ఊరేగింపు

అంబాజీపేట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసిన ఉమా పార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీ, భూ సమేత కేశవస్వామి వార్ల పల్లకీ ఊరేగింపును మంగళవారం నిర్వహించారు. సంక్రాంతి సాంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా గంగిరెద్దు హరిదాసుల ప్రదర్శనలతో స్వామి వారి గ్రామోత్సవాన్ని చేపట్టారు. ఈ ఉత్సవాన్ని గ్రామానికి చెందిన గ్రంధి వారి కుటుంబ సభ్యులు జరిపించారు.

### ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను అధిగమించడంతో పాటు ప్రసవాలను ప్రోత్సహించాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సాయికిషోర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఆయా గ్రామాల పీహెచ్‌సీల్లోమంగళవారం వైద్యారోగ్య, ఆశ సిబ్బందికి సమావేశం జరిగింది. గత డిసెంబర్ నెలలో సాధించిన వలసిన ప్రగతిని అధికారులు వివరించారు. గ్రామ సచివాలయాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను వివరించి ఆరోగ్య సేవలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు.


### 118వ రోజుకు చేరిన రిలే దీక్ష

మలికిపురం: స్థానిక ఎంవీఎన్‌జేఎస్ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేస్తున్న రిలే నిరాహార నిరసన మంగళవారం118వ రోజుకు చేరుకుంది. బకాయి జీతాలు చెల్లించి, అవసరాన్ని బట్టి స్టాఫ్‌ని తీసుకుంటానని చెప్పిన కరస్పాండెంట్ తీరును నిరసించారు. అదే విధంగా 118 రోజులైన నియోజకవర్గంలో ఎవరూ కూడా సమస్యను పరిష్కరించలేక పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా అధ్యాపకుల హక్కుల కోసం కోర్టుకి వెళ్తే అక్కడ కూడా వారికి అడ్డుపడి వారి హక్కులకు కరస్పాండెంట్ భంగం కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు.

### 12న కొబ్బరి అభివృద్ధి బోర్డు అవతరణ దినోత్సవం

రావులపాలెం: కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పడి 45 సంవత్సరాలు కావడంతో బోర్డు అవతరణ దినోత్సవం ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. స్థానిక సీఆర్‌సీలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా అవతరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి కొబ్బరి రైతులందరూ ప్రత్యేక ఆహ్వానితులే అన్నారు. కొబ్బరి పండిస్తున్న రైతులందరూ ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### అండర్-12 క్రికెట్ పోటీలకు 'కొండపల్లి'


కొండపల్లి వివేక్

పి.గన్నవరం: ఎల్.గన్నవరం గ్రామానికి చెందిన నాలుగో తరగతి విద్యార్థి కొండపల్లి వివేక్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-12 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. అమలాపురం గేమ్ ఆన్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న వివేక్ బ్యాట్స్‌మన్‌గా రాణిస్తున్నాడు. దీంతో ఇటీవల కాకినాడలో జరిగిన సెలక్షన్స్‌లో వివేక్‌ను ఉమ్మడి జిల్లా టీమ్‌కు బ్యాట్స్‌మన్‌గా ఎంపిక చేశారు. వివేక్ అమలాపురంలోని ప్రైవేటు స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఈనెల 9 నుంచి విజయనగరంలో జరగనున్న అండర్-12 క్రికెట్ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరఫున ఆడనున్నాడు. వివేక్‌ను అకాడమీ నిర్వాహకుడు కూచిమంచి కృష్ణ, జిల్లా కోచ్‌లు మట్టా సత్తిబాబు, వెంకట నగేష్, నిమ్మకాయల శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

# పంట కాలువల అభివృద్ధికి చర్యలు


జొన్నాడ-ఆలమూరు మధ్య పంటకాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ప్రతినిధులు

ఆలమూరు: మండలంలోని జొన్నాడ నుంచి ఆలమూరు వరకూ ప్రవహించే పంట కాలువను ఆధునీకరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసు, ఇరిగేషన్ జేఈ టి.కృష్ణ త్రిమూర్తులు అన్నారు. మండలంలోని జొన్నాడ ప్రధాన కాలువ నుంచి సుమారు మూడు కిలోమీటర్ల మేర ఆలమూరు ఇటుక బట్టీల వరకూ పంటకాలువ పూడికతో నిండిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు స్థానిక రైతులతో మాట్లాడి పంట కాలువ వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించడంతో పాటు పూడికతీత పనుల చేపట్టేందుకు రైతులు, స్థానికులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. దీంతో స్థానిక రైతులు తమ అంగీకారాన్ని తెలియజేయడంతో బుధవారం నుంచి పూడికతీత పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్లు నీటి సంఘం ప్రతినిధులు తెలిపారు. తాడి శ్రీనివాసరెడ్డి, సూరపురెడ్డి సూర్యనారాయణ, రావాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలు సమర్థంగా అమలు చేయాలి

ఆలమూరు: కార్మిక శాఖ చట్టాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజల హక్కులను పరిరక్షించాలని మండపేట సహాయ కార్మికశాఖ అధికారి అధికారి కాశీ శివ నాగ మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని చొప్పెల్లలోని పలు ఇటుక బట్టీలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కార్మిక శాఖ వారి ఆన్‌లైన్ తనిఖీ విధానంలో భాగంగా మంగళవారం ఆయన చొప్పెల్లలోని మూడు ఇటుక బట్టీల్లో తనిఖీలు నిర్వహించారు. ఇటుకబట్టీ యజమానులు నిర్వహించాల్సిన రిజిస్టర్లు సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో పరిశీలించారు. అనంతరం రిజిస్టర్ల నిర్వహణలో ఉన్న లోపాలను సరిచేసుకోవాలని వారిని ఆదేశించారు. కార్మిక సంక్షేమ నిధికి తమ వద్ద పని చేస్తున్న కార్మికునికి రూ.100 చొప్పున బ్యాంకులో కానీ ఆన్‌లైన్ విధానంలో కానీ చెల్లించాలని సూచించారు. ఫారం ఎఫ్ పూర్తి చేసి నగదు కట్టిన చలానా జతపరిచి ఆ వివరాలను కార్మిక శాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. కార్మికులకు ఈ–శ్రమ్ కార్డులను, పింఛన్ స్కీమును అమలు చేసే విధంగా యజమానులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కనీస వేతన చట్ట ప్రకారం జీతాలు చెల్లించడంతో పాటు దానికనుగుణంగా రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. ఇటుకు బట్టీల్లో బాల కార్మికులు చేర్చుకోకూడదన్నారు నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం


ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట/కొత్తపేట/సఖినేటిపల్లి/మలికిపురం/మామిడికుదురు/ఆలమూరు/రాజోలు/అయినవిల్లి: ప్రస్తుత వాతావరణంలో ప్రతి విద్యార్థి ఆటలు ఆడటం వల్ల మానసికోల్లాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న కోనసీమ క్రీడోత్సం, ఆటలతో ఆరోగ్యం కార్యక్రమాన్ని ఎంఈఓల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. కోనసీమ క్రీడోత్సవం–ఆటలతో ఆరోగ్యం మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం కొత్తపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి పర్యవేక్షణలో క్రీడాపోటీల కో ఆర్డినేటర్ వైఎస్ ఉషారాణి ఆధ్వర్యంలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఎంపీపీ గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మోరిలో జరిగిన ఆటల పోటీల్లో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందింప చేసేందుకు క్రీడా పోటీలు దోహదపడతాయని ఎంపీపీ వీరా మల్లిబాబు అన్నారు. మంగళవారం మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 15 పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. మలికిపురంలో క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మలికిపురం ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి పేర్కొన్నారు. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ లాంఛనంగా ప్రారంభించారు. ఆలమూరులో జరిగిన మండల స్థాయి క్రీడాపోటీలు జరిగాయి. క్రీడల్లో పాల్గొన్న వారికి మానసిక ఉల్లాసంతో పాటు మెరుగైన ఆరోగ్యం సంభవిస్తుందని ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. మండల స్థాయి ఆటల పోటీలను ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల విద్యాశాఖ ఏర్పాటు చేసింది. రాజోలులో స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ కేతా శ్రీనివాస్ ప్రారంభించారు. అయినవిల్లి క్రీడలతో విద్యార్థులలో మానసికోల్లాసం అలవడుతోందని స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పతాకాన్ని ఆవిష్కరించారు.